బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- రేపటి నుంచి లింగబస్వేశ్వర ఆలయ వార్షికోత్సవాలు
- మూడు రోజుల పాటు జరగనున్న వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

బీబీనగర్: మండలంలోని పడమటిసోమారం గ్రామంలో గల శ్రీ లింగబస్వేశ్వర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. రేపట్నుంచి (శనివారం) నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన ఈ ఆలయానికి రాజకీయ ప్రముఖులతో పాటు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఉత్సవాలకు ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడంతో పాటు రెండు రోజుల పాటు ఇక్కడే బస చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం చుట్టూ చలువ పందిళ్లు వేయించారు. తాగునీటి వసతితో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఎండోమెంట్ శాఖతో పాటు పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఇటీవల సీపీ సుధీర్‌బాబు ఆలయాన్ని సందర్శించి పోలీస్ బందోబస్తుపై పలు సూచనలు చేశారు.


ఉత్సవాలకు ముస్తాబైన లింగబస్వేశ్వర ఆలయం


స్వామివారి మూలవిరాట్

ఉత్సవాలు ఇలా..
ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. 22న గణపతిపూజ, అంకురార్పణ, అఖండ దీపారాధన, స్వామివారికి అభిషేకం, స్వామి వారి ఊరేగింపు, ఎదుర్కోళ్ల రాత్రి స్వామివారి కల్యాణమహోత్సవం, 23న అగ్నిగుండాల మహోత్సవం, 24న స్వామివారి విమానరథోత్సవం, చక్రవరి అమృత స్నానం నిర్వహించనున్నారు.

మూడు రోజుల పాటు ఉత్సవాలు



మూడు రోజుల పాటు జరుగనున్న లింగబస్వేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మూడు రోజుల పాటు జరనున్నాయి. ఉత్సవాలకు భక్తుల అధిక సంఖ్యలో రానున్నారు. అందుకు తగిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అధికారులను సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.
– సందిగారి బస్వయ్య, ఆలయ కమిటీ చైర్మన్

ఏర్పాట్లు పూర్తి చేశాం

బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. రెండు రోజుల పాటు భక్తులు ఇక్కడే బస చేసి స్వామిని దర్శించుకోనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వివిధ శాఖల సహకారంతో ఆలయం వద్ద మౌలిక వసతులు కల్పిస్తున్నాం.
– నరేందర్ రెడ్డి, ఆలయ ఈఓ

రుణాల మంజూరుపై దృష్టి సారించాలి

- కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి: రైతు రుణాలు, కేంద్ర, రాష్ట్ర పథకాల రుణాల మంజూరుపై ప్రత్యేక దష్టి సారించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యువత, స్త్రీలకు ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బ్యాంకు లింకేజ్ రుణాలు పెండింగ్ పెట్టకుండా మంజూరు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల రుణాలను వేగంగా అందించాలని తెలిపారు. బ్యాంకులకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలని సంబంధిత బ్యాంకు అధికారులను ఆదేశించారు. సామాజిక, ఆర్థిక స్థిరత్వం సాధించడంలో మహిళల పాత్రను పెంపొందించేందుకు రుణాలు అందించాలని సూచించారు. రుణాలు ఇచ్చే ప్రక్రియలో పారదర్శకత, వేగం అవసరమని స్పష్టం చేశారు. రుణాల మంజూరులో సమస్యలు ఎదురవుతున్న చోట వాటిని వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత బ్యాంకులదేనని అన్నారు. పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి లబ్ధిదారులకు కిసాన్ క్రెడిట్ ఋణాలు సకాలంలో ఇవ్వాలని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 24 నుండి 28వ తేదీ వరకు జరిగే ఆర్థిక వారోత్సవాలు నిర్వహించాలని కోరారు. అనంతరం పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ 2025–26 పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య నిర్వహణధికారి శోభారాణి, లీడ్ బ్యాంకు మేనేజర్ శివరామకృష్ణ, ఆర్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మి శ్రావ్య, నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వినయ్‌కుమార్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శ్యామ్‌సుందర్, జిల్లా పరిశ్రమల అధికారి రవీందర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

ప్రభుత్వ ఉన్నత పాఠశాల సందర్శన
బొమ్మలరామారం : తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ ప్రభుత్వ పాఠశాలను గురువారం కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. ఆయన వెంట డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ సునంద, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ రాజాత్రివిక్రమ్ పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి

వలిగొండ : ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపెల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించా రు. బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బీమా నాయక్, సద్ది సందీప్ రెడ్డి, గూడూరు శ్రీధర్ రెడ్డి, నూతి రమేష్, పలుసం సతీష్,గంగాపురం దైవాధీనం, బాతరాజు బాల్ నర్సింహ, చెరుకు శివయ్య, గరిసె రవి, మంగలారం వెంకట్ రెడ్డి, జోగు యాదయ్య పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

వలిగొండ : మండలంలోని ఆరూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని మాజీ ఎంపీపీ చిట్టెడి జనార్దన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ని 21న గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల సంస్కారం, 22న వేద పారాయణం, హారతి మంత్రపుష్పములు, జలాధివాసం, 23న యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహ సహిత ఉమామహేశ్వర స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. మహా పూర్ణాహుతి అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

అర్హులందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలి

భూదాన్‌పోచంపల్లి : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో మార్చి 1, 2వ తేదీల్లో సీపీఎం జిల్లా స్థాయి క్యాడర్ తరగతులను జయప్రదం చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని అన్నారు. జిల్లా స్థాయి సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఆలిండియా కమిటీసభ్యులు బి. వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు గూడూరు అంజిరెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు, జగన్, లక్ష్మయ్య, పత్తి బిక్షపతి, అందెల జ్యోతి, పగిళ్ల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో అక్రమంగా ఇసుక డంప్ చేసి విక్రయిస్తున్న గూడురు దిలీప్‌రెడ్డి, బిట్ల నర్సిరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇసుక అక్రమంగా డంప్ చేసిన.. తరలించిన కఠిన చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్థికసాయం అందజేత

రామన్నపేట : ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన సీనియర్ రిపోర్టర్ ఎండీ గౌస్ కుటుంబ సభ్యులను సీపీఐ జాతీయ సమితీ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు గురువారం పరామర్శించారు. ప్రజాపక్షం యాజమాన్యం తరపు రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయనవెంట పార్టీ నాయకులు ఊట్కూరి నర్సింహ, ఎర్ర రమేష్‌గౌడ్, శివరాత్రి సమ్మ య్య, గంగాపురం వెంకటయ్య, రచ్చ యాదగిరి, కళ్లెం యాదగిరి, పల్లె మల్లేష్, ఊట్కూరి కృష్ణ, కొండ వీరస్వామి పాల్గొన్నారు. మండలంలోని నీర్నెముల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నోముల స్వామి కుటుంబానికి స్థానిక ఆదిజాంభవ మహాసేన ఆధ్వర్యంలో గురువారం రూ. 13 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యూసుఫ్‌గూడ ఆర్‌సీఐ నోముల నర్సయ్య సభ్యులు నోముల యాదగిరి, సుదర్శన్, రవిందర్, నోముల మల్లేష్, స్వామి, శివ, శ్రీరాములు, పాల్గొన్నారు.
చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని రాంనగర్‌కాలనీకి చెందిన ఉప్పలపల్లె సత్తమ్మ, మండలంలోని జైకేసారం గ్రామానికి చెందిన తాటి కిష్టయ్యల కుటుంబాలకు గురువారం రాజీవ్ స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 15వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ ఎంఏ.ఖయ్యూం, జైకేసారం మాజీ సర్పంచ్‌లు జింద్రు అంజిరెడ్డి, కొర్వూరి సైదులు, నాయకులు శామకూర రాజయ్య, ఎస్‌కె.జానిబాబు, మాదగోని శేఖర్, డిల్లీ శేఖర్‌రెడ్డి, నయీ సొదాగర్ పాల్గొన్నారు.
యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో కందుకూరి భాస్కర్ మృతి చెందాడు. గురువారం మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు భీమగాని నరసింహా గౌడ్ పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


రామన్నపేట : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామన్నపేట : మండలంలోని ఇస్కిళ్ల శ్రీ గుండా సత్తయ్య మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా అధికారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె. శ్రీనివాస్ ఉపాధ్యాయులు బి.నర్సిరెడ్డి, సురేష్, సంతోష్‌కుమార్, అనిల్‌కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.
ఆత్మకూరు(ఎం): మండలంలోని పల్లెర్ల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బహుతులను అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిమినేటి సోమయ్య, ఉపాధ్యాయులు మోహన్, వేణు పాల్గొన్నారు.


ఆత్మకూరు(ఎం): స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలి

మోత్కూరు : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య అన్నారు. గురువారం మున్సిపల్ కేంద్రంలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే ఉమ్మడి నల్లగొండ- వరంగల్ -ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సంబంధించిన బిల్లులన్నీ క్లియర్ చేయాలని, కేజీబీవీలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలన్నారు. మినిమం టైమ్ స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. గురుకుల, మోడల్ కేజీబీవీ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వెంకటాచారి, మండల శాఖ అధ్యక్షులు దర్శనం వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఎ.సత్తయ్య, టి.ఉప్పలయ్య, , పెండెం నాగార్జున, డి.శ్రీనివాస్, ఎస్.సుధాకర్‌రెడ్డి, జక్కుల రవికుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్

రాజాపేట : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భి క్షమయ్య గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడూతూ కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. తెలంగాణ సుభిక్షంగా ఉండడమే బీఆర్ఎస్ ఏకైక లక్ష్యమన్నారు. అంతకు ముందు నెమిల గ్రామంలో ఇటీవల మృతి చెందిన గీత కార్మికుడు పాల సిద్దులు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు బాలలక్ష్మి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ బాలమణి, గోపాల్‌గౌడ్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, జస్వంత్, భాస్కర్ గౌడ్, సంతోష్ గౌడ్, నర్సింహులు, బిల్లకు దురు రాజు, రాములు నాయక్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

రాజాపేట : మండలంలోని చల్లూరు శివశంకర పార్వతీ దేవాలయ వార్షికోత్సవ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 25న ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, హోమం, 26న మహాన్యాసక ఏకాదశ రుద్రాభిషేకం, పూర్ణాహుతి, భక్తులకు అన్నదానం, రాత్రి 8 గంటలకు శివపార్వతుల కళ్యాణోత్సవం, అనంతరం రథోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పట్టభద్రుల సంఘం ప్రతినిధులు

చౌటుప్పల్ : రాష్ట్రంలో డిటెన్షన్ విద్యా విధానాన్ని అమలు చేయాలని కోరుతూ పట్టభద్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీరాములు, ప్రధానకార్యదర్శి పాలకూర్ల మురళి గురువారం ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే దేశంలో సగం రాష్ట్రాల్లో ఈ విద్యా విధానం అమల్లో ఉందన్నారు. దీనిని అమలు చేయడం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నడుమ సమన్వయం ఏర్పడుతుందన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ప్రభుత్వం డిటెన్షన్ విద్యా విధానాన్ని అమలు చేసేందుకు తగిన చర్య తీసుకోవాలని కోరారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గుంతల రోడ్డుకు మరమ్మతులు


గుంతలు పూడుస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

భువనగిరిటౌన్ : భువనగిరి నుంచి హన్మాకొండ వెళ్లే మార్గంలో మాస్ కుంట వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను గురువారం డీవైఎఫ్ఐ నాయకులు పూడ్చారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ మాట్లాడుతూ గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దయ్యాల మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, ఎండీ సాజీద్, సోహెల్, ప్రవీణ్, ఫయాజ్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


జనంపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట : యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం జనంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆయన ప్రారంభించారు. స్థానిక యువకులతో కలిసి క్రికెట్ ఆడారు. క్రీడలు, ఏకాగ్రతను, దేహధారుఢ్యంను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు జినుకల ప్రభాకర్, గోదాసు పృథ్వీరాజ్, చలమల్ల లింగారెడ్డి, పల్లపు రాములు, బండ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ
మండలంలోని ఇంద్రపాలనగరం శంకరునిగుట్టపై కొలువైఉన్న శ్రీ శివపార్వతుల ఆలయ బ్రహ్మోత్సవాల ఆహ్వాన కరపత్రాన్ని గురువారం ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్లోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ పూస బాలనర్సింహ, మార్కెట్ డైరెక్టర్ వెంకటేశం ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ నేత్రాలు దానం

చౌటుప్పల్ : మండల పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ పగిళ్ల వెంకట్‌రెడ్డి(68) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు.ఆయన కళ్లను దానం చేయాలని అతని భార్య శశిరేఖతో పాటు ఇతర కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. గురువారం నల్లగొండలోని లయన్స్‌క్లబ్ ఐ డొనేషన్ కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఐ డొనేషన్ సెంటర్ ప్రతినిధులు వచ్చి నేత్రాలను సేకరించారు.

రమణేశ్వరంలో పూజలు


వారాహిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో గల రమణేశ్వరంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. గురువారం వారాహిదేవి విగ్రహాన్ని సిద్ధగురు రమణానంద మహర్షి ప్రతిష్ఠించి యంత్ర స్థాపన చేశారు. అనంతరం శివలింగాలను ప్రతిష్ఠించి అభిషేకాలు, పూజలు చేశారు.

బెల్ట్ దుకాణాలపై పోలీసుల దాడులు

ఆలేరురూరల్ : ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలోని బెల్ట్ దుకాణాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఇందూరి రాజిరెడ్డి దకాణంలో ఆరు లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రజినీకర్ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ తీసుకురావడం హర్షణీయం

యాదగిరిగుట్ట: రాష్ట్రంలోఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగవంతానికి ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకోవడం హర్షణీయమని యాదాద్రి రియల్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ అన్నారు. గురువారం స్థానిక రియల్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు కొకుంట్ల బాల్‌రెడ్డి, ఉపాధ్యాక్షులు నర్సింహ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజు, స్వామిగౌడ్, పసుల శ్రీను, కొంగరి శంకర్, గంగసాని నవీన్, సిలివేరు కిషోర్, చంద్రమౌళి, గణేష్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


రోగులతో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

చౌటుప్పల్ : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధుకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 100పడకల ఆస్పత్రి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రిలో గుర్తించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు దేవేందర్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.ఖయ్యూం, సుర్జీత్, ఆర్.శ్రీకాంత్, ఎస్.శ్రీకాంత్, పృథ్వీ, రవితేజ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

అడ్డగూడూరు: రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 14నెలల్లోనే తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధి కోసం రూ.1300కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం నిరుపేదలకు దక్కుతున్నాయన్నారు. మండలంలో తహసీల్దార్ భవన నిర్మాణం కోసం త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. బిక్కేరు వాగులో గోదావరి జలాలు తీసుకొచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మగోటి జోజి, మోత్కూరు మార్కెట్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, డైరెక్టర్లు బాలెంల విద్యాసాగర్, చిత్తలూరి సోమన్న, కాంగ్రెస్ మహిళా విభాగం అ ధ్యక్షురాలు అంజమ్మ లక్ష్మయ్య, పాశం సత్యనారాయణ, ఇటికాల చిరంజీవి, జోసఫ్, సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం


పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఆలేరురూరల్ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఆర్యవైశ్య వర్గానికి చెందిన రేఖా గుప్తాను సీఎంగా నియమించినందుకు హర్షం వ్యక్త ం చేస్తూ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పసుపునూరి వీరేశం, ఆర్యవైశ్య సంఘం నాయకులు సముద్రాల శ్రీనివాస్, సీఎచ్.ప్రకాష్, సముద్రాల సత్యం, తాటికొండ ఉపేందర్, గందె అంజయ్య, ఎం.అశోక్, మల్లిఖార్జున్, జగదీష్, ప్రకాష్, పి.ఉపేందర్, కుమార్ పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలని వినతి

భువనగిరి : పట్టణ శివారులోని కేంద్రియ విద్యాలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా సర్వీస్‌రోడ్డు నిర్మించాలని కోరుతూ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పిన్నింటి స్టాన్లీ గురువారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు వరంగల్–హైదరాబాద్ రహదారిని దాటలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డును నిర్మించాలని వినతి పత్రంలో కోరారు.

హర్షవర్దన్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం

ఆత్మకూరు(ఎం): ఉమ్మడి నల్లగొండ – వరంగల్ – ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాల్ రెడ్డి హర్షవర్దన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత వేసి గెలిపించాలని కోరుతూ పలువురు ఉపాధ్యాయులు గురువారం పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం హర్షవర్దన్ రెడ్డి కృషి చేస్తారన్నారు. ప్రచారంలో ఆకుల శ్రీనువాస్, ఉపాధ్యాయులు నాతి మల్లేష్, మంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కాల్య శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో ఆరోగ్య సమస్యలు


మాట్లాడుతున్న డాక్టర్ యశోద

భువనగిరి : అయోడిన్ లోపంతో ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు అయోడిన్ లోపంతో వచ్చే వాధ్యుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ లోపంతో గాయిటర్, థైరాయిడ్ సమస్యలు వస్తాయన్నారు. అయోడిన్ లోపం , రక్తహీనత నివారణ కోసం సూక్ష్మ పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాలతో పాటు తృణధాన్యాలు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి అంజయ్య, ఇ నిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ ప్రవీణ్, డాక్టర్ అనూష, కుంభం రాజీవ్ పాల్గొన్నారు.

ఐదు తులాల బంగారు ఆభరణాలు చోరీ

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో బుధవారం సాయంత్రం ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తి చొరబడి ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. గురువారం సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ కాలనీలో నివాసముంటున్న వట్టి దేవేందర్‌రెడ్డి తన ఇంటి ముందు పైప్‌లైన్ పగిలిపోవడంతో బుధవారం సాయంత్రం మున్సిపాలిటీ సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. ఆ పనులను దేవేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటి ముందు నిల్చొని పరిశీలిస్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి బీరువాలోని ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరించాడు. కొంతసేపటి తర్వాత ఇంట్లోకి వెళ్లిన దేవేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు చోరీ జరిగినట్లు గుర్తించి లబోదిబోమన్నారు. గురువారం ఇంటి యజమాని దేవేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.